


23న శ్రీకాకుళంలో ఉద్యోగ మేళా

శ్రీకాకుళం కలెక్టరేట్/ పాత శ్రీకాకుళం, జూలై 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని అభ్యుదయ డిగ్రీ కళాశాలలో ఈ నెల 23న ఉద్యోగమేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి యు.సాయికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'మ్యాన్‌కైండ్ ఫార్మా లిమిటెడ్ సంస్థలో 50 ఖాళీలకు నియామకాలు చేపట్టనున్నాం. బీఎస్సీ కెమిస్ట్రీలో 70శాతం మార్కులు సాధించి 2023-2025 మధ్య పాసైన పురుషులు అర్హులు. 'నైపుణ్యం.ఏపీ.జీఓవీ. ఇన్' వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకుని ధ్రువపత్రాలతో హాజరుకావాల'ని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు 6301045132 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.



నిలకడ లేని జీడి ధర



- రెండు నెలల్లో రూ.వెయ్యి పతనం
- ప్రస్తుతం 80కిలోల పిక్కల బస్తా రూ.12,500
- దళారీ వ్యవస్థతో రైతులకు నష్టాలు

వజ్రపుకొత్తూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): జీడిపిక్కల ధరల్లో హెచ్చుతగ్గులు చోటు చేసుకుంటున్నాయి. రెండు నెలల్లోనే బస్తాకు రూ.వెయ్యి పతనమైంది. మిగిలిన వాణిజ్య పంటల వలే జీడిపంటకు ధరల స్థిరీకరణ లేకపోవడం ఉద్దానం రైతులకు శాపంగా మారుతోంది. ఎప్పుడు ధర పెరుగుతుందో.. ఎప్పుడు తగ్గుతుందో తెలియక సతమతమవుతున్నారు. పంటను ఎప్పుడు అమ్ముకోవాలో తెలియక నష్టపోతున్నారు. జీడి వ్యాపారాన్ని దళారీ వ్యవస్థ శాసిస్తోందని, ధరలు పెరగకుండా వారే అడ్డుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది 24వేల హెక్టార్లలో జీడి పంట సాగైంది. లక్ష బస్తాల పిక్కలు దిగుబడి ఉంటుందని ఉద్యానవన శాఖాధికారులు చెబుతున్నారు. మే నెలలో 80కిలోల బస్తా ధర రూ.13,500 ఉండగా, ఇప్పుడు రూ.12,500కు పడిపోయింది. రెండు నెలల్లోనే బస్తా ధర రూ.వెయ్యి పతనం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటపై ఆదాయం కంటే మదుపులు, రవాణాకే వ్యయం అధికమవుతోందని వాపోతున్నారు. రానున్న రోజుల్లో కూడా జీడిపిక్కల ధరలు మరింత తగ్గుతాయేమోనని కలవరపడుతున్నారు.

● జిల్లాలోని పలాసతోపాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న జీడి పరిశ్రమలకు ఏటా 5లక్షల బస్తాల పిక్కలు అవసరం. అయితే, ఈ ఏడాది జిల్లాలో లక్ష బస్తాల దిగుబడి మాత్రమే ఉంటుందని అధికారులు చెబుతున్నారు. దీంతో వ్యాపారులు ఇతర ప్రాంతాలు, దేశాల నుంచి జీడిపిక్కలను దిగుమతి చేసుకుంటున్నారు. అక్కడ తక్కువ ధరకు కొనుగోలు చేసి జిల్లాకు తీసుకొస్తున్నారు. విదేశీ పిక్కలతో ఉద్దానంలో పండే పంటకు డిమాండ్ తగ్గుతోంది. ధరలు కూడా తగ్గుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

● జీడి ధరల స్థిరీకరణ చేపడితేనే రైతులకు మేలు జరుగుతుందనే అభిప్రాయం (మిగతా 8వ పేజీలో..)



పేరుకే పెద్దాసుపత్రి

- జీజీహెచ్‌లో వెంటాడుతున్న సమస్యలు
- తరచూ విద్యుత్ కోతతో చీకట్లు
- అరకొర సిబ్బందితో రోగులకు ఇక్కట్లు

శ్రీకాకుళం రిమ్స్, జూలై 20(ఆంధ్రజ్యోతి): అది జిల్లాకే పెద్దాసుపత్రి. జిల్లా నలుమూలల నుంచి అత్యవసర, ప్రమాదకర స్థితిలో ఉన్న కేసులు ఇక్కడికే రిఫరల్‌పై వస్తుంటాయి. 24 గంటలు ఆసుపత్రిలో సేవలు అందించాలి. కానీ సమస్యల నడుమ సక్రమంగా సేవలు అందక రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇదీ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(జీజీహెచ్- రిమ్స్)లో దుస్థితి. ఈ పెద్దాసుపత్రిలో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. చీకట్లోనే రోగులు ఉండాల్సిన పరిస్థితి ఎదరవుతోంది. 930 పడకల ఆసుపత్రిలో పనిచేసేది కేవలం ముగ్గురు ఎలక్ట్రీషియన్లే. అందులోను ఒక్కరే పర్మినెంట్ ఉద్యోగి. దీనికి తోడు దశాబ్దాల కిందట వేసిన విద్యుత్ కేబుల్‌వైర్లు. వెరసి తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు, షార్ట్‌సర్క్యూట్‌లు సర్వసాధారణమైపోయాయి. సుమారు రెండు నెలల కిందట చిన్నపిల్లల వార్డులో షార్ట్‌సర్క్యూట్‌తో కేబుల్‌వైర్లు కాలిపోయాయి. అదృష్టవశాత్తు పెద్ద ప్రమాదం తప్పిపోయింది. అలాగే మూడురోజుల కిందట ప్రసూతి వార్డులో అర్ధరాత్రి సమయంలో సుమారు నాలుగు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో గర్భిణీలు, బాలింతలు, పసిబిడ్డలు నరకయాతన అనుభవించారు. పాత కే బుల్ కాలిపోవడం వల్లనే ఈ ఇబ్బంది తలెత్తింది. నిజానికి ఆసుపత్రికి సంబంధించి సబ్‌స్టేషన్, పవర్ ప్యానెల్స్, జనరేటర్స్, కేబుల్స్ మెయింటెనెన్స్ చేయాల్సిన బాధ్యత (మిగతా 8వ పేజీలో..)

- ఈ నెల 15న టెక్కలి, నరసన్నపేటలో ఎరువుల షాపులపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. నరసన్నపేటలో ఒక ఎరువుల దుకాణంలో రూ.4లక్షలు విలువ చేసే 571 లీటర్ల కలుపు నివారణ మందుల విక్రయాలు నిలుపుదల చేశారు.

....

- ఈ నెల 17న రణస్థలం మండలం కోష్టలో ఎరువుల దుకాణంలో కూడా విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. రికార్డులో పొందు పరచకుండా గోదాంలో నిల్వ ఉన్న రూ.20.46 లక్షల విలువైన 126 మెట్రిక్ టన్నులు ఎరువులు విక్రయించరాదని నోటీసులు జారీ చేశారు.


నరసన్నపేటలోని ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు(ఫైల్)

ఎరువుల షాపులపై విజిలెన్స్!

- ముమ్మరంగా అధికారుల దాడులు
- నాసిరకం విక్రయాలకు చెక్

నరసన్నపేట, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగుల మందుల దుకాణాల్లో నకిలీలను అరికట్టేందుకు, అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రభుత్వం సొసైటీల ద్వారా ఎరువులు అందిస్తోంది. కాగా.. కొన్ని ప్రైవేటు దుకాణాల్లో లైసెన్స్ ముగిసిన కంపెనీల ఎరువులను విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే కొంతమంది వ్యాపారులు ఎరువులను బ్లాక్ చేసి రైతులను దోచుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎరువులు, పురుగుల మందుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ప్రైవేటు ఎరువుల డీలర్లతోపాటు కంపెనీ గోదాములపై దాడులు చేస్తున్నారు. అనుమతి లేని కంపెనీల ఎరువులు, పురుగుమందుల విక్రయాలను నిలిపేస్తున్నారు. నాణ్యమైన ఎరువులు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో ఇటీవల నరసన్నపేట, కోష్ట తదితర ప్రాంతాల్లో తనిఖీ చేసి.. రూ.25లక్షల విలువైన పురుగుల మందులు, ఎరువుల విక్రయాలను నిలిపేశారు. టెక్కలి, కోటబొమ్మాళి, నరసన్నపేట, రణస్థలం, ఆమదాలవలస తదితర ప్రాంతాల్లో ప్రైవేటు ఎరువుల దుకాణాలను కూడా అధికారులు తనిఖీ చేశారు. ఇతర జిల్లాలకు చెందిన వ్యవసాయశాఖ అధికారులు విజిలెన్స్ బృందాలుగా తనిఖీ చేయడంతో ప్రైవేటు వ్యాపారుల లాబీయింగ్‌కు, అక్రమాలకు అవకాశం లేకుండా పోతోంది. ఈ క్రమంలో తమకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు లభిస్తున్నాయని రైతులు చెబుతున్నారు.

ఆదిత్యుడి ఆదాయం
రూ.5.07 లక్షలు

అరసవల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత.. అరసవల్లిలో ఆదిత్యుడ్ని ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆదివారం ఒక్కరోజు స్వామికి రూ.5,07,264 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.2,28,500, విరాళాల ద్వారా రూ.95,569, ప్రసాదాల రూపంలో రూ.1,83,195 ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు.

వెబ్ ఆప్షన్లకు గడువు నేటితో సరి

ఎచ్చెర్ల, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఎంబీఏ కోర్సులో ప్రవేశానికి వెబ్‌ఆప్షన్ల నమోదుకు సోమవారంతో గడువు ముగియనుంది. ఐసెట్ రాసిన విద్యార్థులు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసుకోవచ్చు. అంబేడ్కర్ యూనివర్సిటీలో 44 రెగ్యులర్, 11 సెల్ఫ్‌ఫైనాన్స్ సీట్లు ఉన్నాయని వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోపాటు హాస్టల్ సౌకర్యం ఉంటుందన్నారు.

మూడు గంటలు శ్రమించినా.. దక్కని ప్రాణం

- కోళ్ల వ్యాన్‌ను ఢీకొని లారీ బోల్తా
- డ్రైవర్ మృతి, మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- 600 కోళ్ల మృతితో రూ.1.50 లక్షల నష్టం


డ్రైవర్ సుశాంక్ నాయక్ మృతదేహాన్ని బయటకు తీస్తున్న పోలీసులు, రెస్క్యూటీమ్

పలాస, జూలై 20(ఆంధ్రజ్యోతి): పలాస బైపాస్‌రోడ్డు కోసంగిపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఆగి ఉన్న కోళ్లవ్యాన్‌ను.. ముడి ఐరన్‌లోడుతో వెళ్తున్న లారీ ఢీకొంది. క్యాబిన్‌లో చిక్కుకుని లారీడ్రైవర్ మృతి చెందాడు. కాశీబుగ్గ పోలీసులు, హైవే సిబ్బంది మూడు గంటలపాటు శ్రమించి ముడి ఐరన్‌ను బయటకు తీసినా ఆ డ్రైవర్ ప్రాణం దక్కలేదు. అలాగే వ్యాన్‌డ్రైవర్, క్లీనర్‌తోపాటు లారీ క్లీనర్‌కు గాయాలయ్యాయి. సుమారు 600 కోళ్లు మృతి చెందగా.. రూ.1.50లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. పోలీసుల వివరాల మేరకు..

● ఒడిశా రాష్ట్రం కటక్‌కు చెందిన డ్రైవర్ సుశాంక్ నాయక్(40), క్లీనర్ దీపక్‌నాయక్ ముడి ఐరన్(ఐరన్ రాళ్లు)లోడుతో లారీలో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు శనివారం రాత్రి బయలుదేరారు. ఆదివారం వేకువజామున 5గంటల సమయంలో పలాసలోని కోసంగిపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి దాటిన తర్వాత రోడ్డుపక్కన ఆగి ఉన్న కోళ్లవ్యాన్‌ను లారీతో ఢీకొన్నారు. దీంతో కోళ్లవ్యాన్ బోల్తాపడి నుజ్జయింది. లారీ కూడా 500 మీటర్ల దూరంలో రోడ్డుపక్కన ఉన్న కాలువలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఐరన్ రాళ్లన్నీ క్యాబిన్‌పై పడి నుజ్జయింది. అందులోనే డ్రైవర్ చిక్కుకున్నాడు. ప్రమాదాన్ని గుర్తించిన లారీక్లీనర్ దీపక్‌నాయక్ రోడ్డుపైకి దూకి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. జాతీయ రహదారి రెస్క్యూటీమ్, ఎస్ఐ ఎస్.చంద్రరావు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్ సుశాంక్‌నాయక్ బతికి ఉంటాడని భావించారు. మూడు గంటలపాటు శ్రమించి ఎక్స్‌కవేటర్‌లతో లారీలో ఉన్న ముడి ఐరన్‌ను తొలగించారు. అనంతరం క్యాబిన్‌ను తొలగించగా, డ్రైవర్ విగతజీవిగా కనిపించాడు. ఆ మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

● అలాగే కోళ్లవ్యాన్ నుజ్జవడంతో పలాస మండలం గోదావరిపురం గ్రామానికి చెందిన వ్యాన్ డ్రైవర్ అసపాన లోకేష్, క్లీనర్ అసపాన దయాకర్‌కు గాయాలయ్యాయి. లోకేష్‌కు బలమైన గాయాలు కావడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. లారీ ఢీకొన్న ధాటికి (మిగతా 7వ పేజీలో..)


టీడీపీ నేతలు, కార్యకర్తలతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

రూ.100 కోట్లతో
160 గ్రామాలకు తాగునీరు

- గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించండి: మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : సంతబొమ్మాళి మండలంలో 160 గ్రామాలకు రూ.100 కోట్ల వ్యయంతో ఇంటింటికీ తాగునీరు అందిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆయన ఆదివారం కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో సంతబొమ్మాళి మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ.. 'కూటమి ఏడాది పాలనలో సంక్షేమ పథకాల అమలుతోపాటు అభివృద్ధి కార్యక్రమాలెన్నో చేపట్టాం. రెండేళ్లలో అన్ని గ్రామాలకు మౌలిక వసతులు కల్పిస్తాం. త్వరలో లక్షకుపైగా వితంతువు పింఛన్లు అందజేస్తాం. గత ప్రభుత్వ వైఫల్యాలతోపాటు ప్రస్తుత అభివృద్ధిని ప్రజలకు వివరించాలి. నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. వైసీపీ నాయకుల అసత్యప్రచారాలను తిప్పికొట్టాల'ని పిలుపునిచ్చారు. పార్టీలో కష్టపడిన వారికి సముచిత స్థానం (మిగతా 7వ పేజీలో..)



ముందుకొచ్చిన సముద్రం

జిల్లాలో ఆదివారం వర్షం కురిసింది. సముద్రంలో అలలు ఎగసిపడ్డాయి. గార మండలం బందరువానిపేట వద్ద సముద్రం సుమారు 30 మీటర్లు ముందుకొచ్చింది. ప్రతీనెలా అమావాస్య సమీపంలో సముద్రం పోటెత్తి ఇలా ముందుకు వస్తుందని మత్స్యకారులు తెలిపారు. సురక్షిత ప్రాంతాల్లో పడవలను, తెప్పలను భద్రపరిచారు.

- గార, జూలై 20(ఆంధ్రజ్యోతి)

హెచ్‌ఆర్‌ఏ తీసుకొని.. రాకపోకలు సాగించి..

- టెక్కలి డివిజన్‌లో కొరవడుతున్న ఉద్యోగుల సమయపాలన

8లో

కాలువలు లైనింగ్ లేక.. గుర్రపు డెక్క తొలగించక

- కృష్ణసాగరం ఆయకట్టులో 300 ఎకరాలకు నీరందని దుస్థితి

8లో


ఇచ్ఛాపురంలో మౌనవ్రతంతో మునిసిపల్ పారిశుధ్య కార్మికుల నిరసన

మునిసిపల్ పారిశుధ్య కార్మికుల సమ్మెబాట | కంపు కొడుతున్న పట్టణం

- ఎక్కడి చెత్త అక్కడే..
- ప్రజలకు ఇబ్బందులు

7లో

అధ్వానంగా కాలువలు

● పారిశుధ్య పనులు దారుణం ● ఇక్కట్లకు గురవుతున్న ప్రజలు

పాత శ్రీకాకుళం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగర పరిధిలో కిల్లిపాలెం గ్రామంలో సమస్యలతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగర కార్పొరేషన్‌లో విలీన పంచాయతీ అయిన కిల్లిపాలెంలో సరైన కాలువల సదుపాయం లేక మురుగునీరు నిలిచిపోయి దారుణంగా తయారైంది. ఇళ్ల మధ్య నుంచి మురు గునీరు ప్రవాహంతో ప్రజలు ఇక్కట్లకు గురవు తున్నారు. మురుగునీరు నిలువతో దోమలు ఉత్పత్తి చెంది అనారోగ్యం బారిన పడుతున్నా మని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇళ్లకు అనుకొని ఉన్న కాలువల్లో చెత్తను తొలగించకపోవ డంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఎస్సీ కాలనీ వద్ద రోడ్డుకు అనుకుని ఉన్న కాలువ పరిస్థితి ఇలాగే ఉంది. మురుగునీరు నిల్వతో పాటు పక్కన ఉన్న పొలంలోకి చేరి దుర్గంధం వెదజల్లు తోంది. కిల్లిపాలెం పెట్రోల్ బంకు నుంచి కూడా ఇదే పరిస్థితి ఉంది.


కిల్లిపాలెంలో దారుణంగా ఉన్న కాలువ

ఏడాదిగా రోడ్డుపైనే చెట్టు మొదలు..

కిల్లిపాలెం ప్రధాన మార్గంలో కునుకుపేట జంక్షన్ వద్ద ఏడాది కిందట భారీ చెట్టు పడి పోయింది. దీనిని అప్పటి నుంచి తొలగించక పోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుపై పడిన చెట్టుకు కోసి మిగిలిన బెరడును అలాగే వది లేయడం, కోసిన భాగం పదునుగా ఉండడంతో అటుగా వాహనాలు తప్పు కునే సమయంలో చెట్టు తగిలి గాయాలబారినపడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


రోడ్డుపక్క ఉన్న చెట్టు మొదలు భాగం

కంపు కొడుతున్న పట్టణం

● ఎక్కడి చెత్త అక్కడే.. ● మునిసిపల్ కార్మికుల సమ్మెబాట
● ఇబ్బందులుపడుతున్న ప్రజలు

ఇచ్ఛాపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం పట్టణం కంపుకొడుతోంది. నాలుగు రోజులుగా మునిసిపల్ పారిశుధ్య కార్మికులు సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు దిగడంతో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. ఏ వీధి చూసినా, ఏ రోడ్డు చూసినా చెత్తకుప్పలు కనిపిస్తూ దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు 90 మంది సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. దీంతో


మార్కెట్ వద్ద రోడ్డుపైనే ఉన్న చెత్త


బస్టాండ్ జంక్షన్ వద్ద ఇలా..

ప్రస్తుతం ఉన్న 20 మంది రెగ్యులర్ కార్మికులే చెత్తను తొలగిస్తున్నారు. అయితే పూర్తిస్థాయిలో చెత్త తొలగింపు, కాలువలు శుభ్రం చేసే పరిస్థితి లేకపోవడంతో దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాండ్ జంక్షన్‌లో చెత్త నిల్వ ఉండడంతో ప్రయాణికులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఎదురవు తోంది. దానన్నపేట జంక్షన్, డైలీ మార్కెట్ వెనుక, కొళిగాం రోడ్డు, కరూర్ వైశ్యాబ్యాంక్ ఇలా పలుచోట్ల చెత్త కుప్పలతో ప్రజలు అవస్థలకు గురవుతున్నారు. సమ్మె ఇలాగే కొనసాగితే ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని పలువురు పట్టణ వాసులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించి పట్టణంలో పారిశుధ్య సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.


కాశీబుగ్గ: నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

కొనసాగుతున్న సమ్మె

సమస్యల పరిష్కారం కోసం మునిసిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఆదివారం ఇచ్ఛాపురం, ఆమదాలవలస, పలాసల్లో నిరసనలు చేపట్టారు. కార్యక్రమంలో పలు సంఘాల నేతలు పాల్గొన్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం



ఆమదాలవలస: నినాదాలు చేస్తున్న పారిశుధ్య కార్మికులు

న్యూస్ బాక్స్

లలితాదేవికి ప్రత్యేక పూజలు

శ్రీకాకుళం కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసోత్సవాల సందర్భంగా మొండేటి వీధిలోని లక్ష్మీ గణపతి ఆలయంలో లలితా దేవి ఆదివారం శాకంబరిగా దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలు, పూలతో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

ఎంఈవో-2గా రామకృష్ణ

కవిటి, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఎంఈవో-2గా ఎస్.రామకృష్ణ ఆది వారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఎంఈవో ధనుంజయ మజ్జిని కలిసి నియామక ఉత్తర్వులు అందిం చారు. రామకృష్ణ ప్రస్తుతం బొరివంక జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా విధులు నిర్వహి స్తున్నారు.

సమన్వయంతో పనిచేయాలి

కవిటి, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలస్థాయి నేతలంతా సమన్వయంతో పనిచేయాలని జడ్పీ చైర్‌పర్సన్ పి.విజయ అన్నారు. కవిటిలో ఆదివారం వైసీపీ మండలస్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కె.ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ఆరోపణలు తగవు

కంచిలి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ మండల నేతలు ఆరోపణలు చేయడం తగవని, వీటిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని టీడీపీ మండల నాయకులు సవాల్ విసిరారు. ఈ మేరకు ఆదివారం టీడీపీ మండల అధ్యక్షుడు మాదిన రామారావు ఆధ్వర్యంలో నేతలు విలేకరులతో మాట్లాడారు. వైసీపీ హయాంలో జరిగిన అవినీతి గురించి ఎమ్మెల్యే ఇటీవల ప్రస్తావించారని, దీని నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే ఆరోపణలు చేస్తున్నారన్నారు. పీఏసీఎస్ చైర్మన్ పైల పురుషోత్తం రెడ్డి, బంగారు కురయ్య తదితరులు పాల్గొన్నారు.

మూడు గంటలు శ్రమించినా.. దక్కని ప్రాణం

(ఐదో పేజీ తరువాయి)

వ్యాన్‌లో ఉన్న 600 కోళ్లు మృతి చెందగా, మరో 150 కోళ్లను అతికష్టంపై రక్షించి తరలించారు. కోళ్ల మృతి చెందడంతో తమ కష్టం నేలపాలైందని వాన్ డ్రైవర్, క్లీనరు కన్నీటిపర్యంతమయ్యారు. బరంపురం(ఒడిశా)లో కోళ్లను కొను గోలు చేసి.. ఇచ్ఛాపురం, సోంపేట, మందస, పలాస, టెక్కలి, నందిగాం వరకూ వాటిని చికెన్ సెంటర్లకు విక్రయించి ఉపాధి పొందేవారమని తెలిపారు. లారీ ఢీకొన డంతో తమకు రూ.1.50 లక్షల మేరకు నష్టం వాటిల్లిందని వాపో యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కాశీబుగ్గ సీఐ పి.సూర్య నారాయణ తెలిపారు.


నుజ్జయిన వ్యాన్.. మరణించిన కోళ్లు

రూ.100 కోట్లతో 160 గ్రామాలకు తాగునీరు

(ఐదో పేజీ తరువాయి)

ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే ప్రజాదర్బార్‌లో భాగంగా వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి వినతులను మంత్రి అచ్చెన్న స్వీకరించారు. ఇళ్లు, స్థలాలు, పింఛన్లు మంజూరు చేయాలని, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు అందజేయాలని పలువురు వినతిపత్రాలు అందజేశారు. టెక్కలి నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకులు తమ ప్రాంత సమస్యలను వివరించారు. విడతల వారీ సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి అచ్చెన్న హామీ ఇచ్చారు. అలాగే ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వర రావు.. మంత్రి అచ్చెన్నను మర్యాదపూర్వకంగా కలిశారు.

డైవర్షన్ పాలిటిక్స్ కోసమే మిథున్‌రెడ్డి అరెస్టు

శ్రీకాకుళం అర్బన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సర్వేలో ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వస్తున్నందున డైవర్షన్ పాలిటిక్స్ కోసమే వైసీపీ మాజీ ఎంపీ మిథున్ రెడ్డిని లిక్కర్ స్కాంలో అక్రమంగా అరెస్టు చేశారని మాజీ మంత్రి, వైసీపీ నేత సీదిరి అప్పలరాజు విమర్శించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో లిక్కర్ స్కాం జరగడానికి అవకాశం లేదని, ఎందుకంటే మద్యం దుకాణాలు పూర్తిగా అప్పటి ప్రభుత్వమే నడిపిందన్నారు. అయితే లిక్కర్ స్కామ్ అంటూ కూటమి ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరించడం తగదన్నారు. అచ్చెన్నాయుడు మంత్రి పదవి పోతుందన్న భయంతో వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని, ఇప్పటికే సొంత ఎమ్మెల్యేలను సైతం మింగేస్తున్నాడన్న ప్రచారం ఉత్తరాంధ్రలో జోరుగా సాగుతోందన్నారు.

సమరశీల పోరాటాలతోనే హక్కుల సాధన

అరసవల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి): సమరశీల పోరాటాలతోనే కార్మిక హక్కుల సాధన సాధ్యమని, ఈ దిశగా కార్మికులు కృషి చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శులు బీవీవీ కొండలరావు, పడాల రమణ అన్నారు. స్థానిక రామలక్ష్మణ జంక్షన్ వద్ద ఉన్న క్రాంతి భవన్‌లో సంఘం ఆదివారం విస్తృత స్థాయి సమావేశం నిర్వ హించారు. కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లుగా చేయడం ద్వారా కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోం దన్నారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు చిక్కాల గోవిందరావు, టి.తిరుపతిరావు, అప్పలరాజు, లబ్బ.రాజు, కె.వేణుగోపాల్, జి.శ్రీను పాల్గొన్నారు.

అధ్యాపకుల సమస్యలపై స్పందించాలి

అరసవల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస డిగ్రీ కళాశాల అధ్యాపకుల సమస్యలపై చర్యలు తీసుకోవాలని అధ్యాపకుల సంఘం(జీసీటీఏ), ప్రభుత్వ డిగ్రీ కళాశాల గజిటెడ్ అధ్యాపకుల సంఘం(జీసీజీటీఏ) కోరారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆమదాలవలస కళాశాలలో అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలపై నెల రోజుల కిందట వినతిపత్రం అందించామని, అయితే నేటికీ ప్రిన్సిపాల్ ఎన్ఎస్ఎస్ స్వామి చర్యలు తీసుకోలేదన్నారు. అధ్యాపకులు స్టాఫ్ రూంలో కూర్చునే పరిస్థితులు లేవని, వృత్తిపరమైన వాతావరణం కరువైందని, అలాగే కొందరు అతిథి అధ్యాపకుల ప్రవర్తన వల్ల ఇబ్బంది పడుతున్నామన్నారు. ఇప్పటికైనా ప్రిన్సిపాల్ స్వామి స్పందించాలని వారు కోరారు. ప్రకటన విడుదల చేసిన వారిలో డా.ఎస్.సాయి కుమార్, పి.రామారావు, ఎల్.కృష్ణారావు, రవిశంకర్, ఎస్.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఆదిత్యాలయానికి ఫ్రిడ్జ్ అందజేత

అరసవల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానానికి శ్రీకాకుళానికి చెందిన బరాటం మణికంఠ ఒక ఫ్రిడ్జ్, వాటర్ డిస్పెన్సర్‌ను ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయనను అర్చకులు ఆశీర్వదించగా ఈవో ప్రసాదం, జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డి.వెంకటరమణ పాల్గొన్నారు.

నేర చరిత్రను విడనాడండి

శ్రీకాకుళం క్రైం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు నేర చరిత్రను విడనాడి సత్ప్రవర్తనతో మెలగాలని శ్రీకాకుళం రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు, ఒకటో పట్టణ ఎస్ఐ హరికృష్ణ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం శ్రీకాకుళం ఒకటి, రెండో పట్టణ పోలీస్ స్టేషన్లలో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఘర్షణలకు, అసాంఘిక కార్య కలాపాలకు దూరంగా ఉండాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. రౌడీషీటర్లపై నిరంతర నిఘా ఉంటుందని స్పష్టం చేశారు.

పొన్నాడ కొండ పర్యాటకాభివృద్ధికి డ్రోన్ సర్వే

ఎచ్చెర్ల, జూలై 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరానికి సమీపంలో ఉన్న పొన్నాడ కొండ (చింతలమెట్ట)ను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు డ్రోన్ సర్వే చేపట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే జరిగింది. వివిధ సంస్థలకు గతంలో అందించిన భూములను సర్వే చేశారు. ఈ కొండను అభివృద్ధి చేస్తే పొన్నాడ పరిసరాల గ్రామాలతో పాటు, శ్రీకాకుళం ప్రజలకు ఎంతో అనువుగా ఉంటుంది. డ్రోన్ సర్వేతో పొన్నాడ కొండకు మంచి రోజులు రానున్నాయని స్థానిక స్పందన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పంచిరెడ్డి కృష్ణారావు తెలిపారు.

విద్యార్థుల సైకిళ్లకు నగదు పంపిణీ

ఆమదాలవలస, జూలై 20 (ఆంధ్రజ్యోతి): దూసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు ఉపాధ్యాయులు సొంత నిధులతో సైకిళ్లు కొనుగోలుకు ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఒక్కో విద్యార్థికి రూ.5 వేలు వంతున మొత్తం 12 మందికి నగదును ఆది వారం డీఈవో తిరుమల చైతన్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ విద్యార్థులకు అందజేశారు. తోటాడ, అక్కివరం పంచాయతీలకు చెందిన 12 మంది విద్యార్థులు దూసి హైస్కూల్‌కు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నందున ఉపాధ్యాయులు సైకిళ్లను కొనుగోలు చేసి ఇవ్వాలని భావించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్, డీఈవో తిరుమల చైతన్య, ఎంఈవో రాజేంద్ర ప్రసాద్ ఉపాధ్యాయులను అభినందించారు.


విద్యార్థులకు నగదు అందిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

సర్వీస్ రోడ్డుపై వర్షపు నీరు

లావేరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఆదివారం కురిసి భారీ వర్షానికి సుభద్రాపురం హైవే సర్వీసు రోడ్డులో వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో ప్రయా ణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఫ్లై ఓవర్‌కు ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్డు లోతట్టుగా ఉండడంతో వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు అవకాశం లేదని, దీంతో ఎప్పుడు వర్షం కురిసినా గంటల తరబడి రోడ్డుపైనే నీరు నిలిచిపోతోందని స్థానికులు చెబుతున్నారు. దీంతో ప్రతిసారి ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఇప్పటికైనా హైవే అధికారులు స్పం దించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


సుభద్రాపురం జంక్షన్ వద్ద రహదారిపై నిలిచిన నీరు

గార మండలంలో వర్షం

గార, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొన్ని ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం వర్షం కురిసింది. గార, కళింగపట్నం, బూరవెల్లి తదితర గ్రామాల్లో వర్షం కురవడంతో రైతులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ వర్షం ఖరీఫ్ వరి ఎదలు, నారు మళ్లకు ఎంతో మేలు చేస్తుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.


కళింగపట్నం మెయిన్ రోడ్డుపై వర్షపు నీరు

ఉపాధ్యాయులను బదిలీ చేసి జీతాలివ్వలేదు

అరసవల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ఇటీవల బదిలీలు చేశారని, అయితే నేటికీ జీతాలు ఇవ్వలేదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా అధ్యక్షుడు దుప్పల శివరాం ప్రసాద్ అన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీతాల చెల్లింపులో ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణమని, తక్షణం స్పందించి పొజిషన్ ఐడీలు జారీ చేసి జీతాలు అందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు యూని ఫారాలు, నోట్ బుక్స్, టీచర్లకు హ్యాండ్ బుక్స్ ఇప్పటికీ అనేక పాఠశాలలకు చేరలేదని, తక్షణం తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సంఘం పోలాకి మండల కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా సింగుపురం రాజు, ప్రధాన కార్యదర్శిగా ఊడికల వేణుగోపాలరావులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు పి.కాశీవిశ్వనాథ్, జి.చిన్ని కృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆపస్ జిల్లా అధ్యక్షుడు శివరాం ప్రసాద్

మేథోశక్తిని పెంపొందించేందుకు చెస్ దోహదం

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో మేథోశక్తిని పెంపొందించేందుకు చెస్ పోటీలు దోహదం చేస్తాయని చెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ అన్నారు. నగరంలోని ఆదివారం నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో బాలబాలికల రాష్ట్రస్థాయి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లో చదరంగంపై ఆదరణ పెరిగిందన్నారు. ఈ పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి 12 విభాగాలకు చెందిన 116 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విజేత లకు టీడీపీ నేత చౌదరి బాబ్జీ సర్టిఫికెట్లు, జ్ఞాపి కలు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర వైస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, సనపల భీమారావు, సంఘం కార్యదర్శి జామి రమేష్, కేవీవీశర్మ పాల్గొన్నారు.



విజేతలతో టీడీపీ నేత బాబ్జీ, నిర్వాహకులు

8 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎచ్చెర్ల, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఎస్ఎంపురం సమీపంలో ఓ ఇంట్లో ఆదివారం పేకాట ఆడుతున్న 8 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.21,130 నగదు, 7 సెల్‌ఫోన్లు, 3 బైక్‌లు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.అప్పలరాజు తెలిపారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం: అశోక్


నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్

సోంపేట రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. వేలాది ఎకరాలకు సాగునీరు అందించే పైడిగాం చానల్ నుంచి బాతుపురం వద్ద ఆదివారం పూజ చేసి నీటిని విడుదల చేశారు. ప్రతీ ఎకరాకు సాగునీరందించే దిశలో కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చంద్ర మోహన్, నేతలు మద్దు కుమార్, మద్దిల నాగేశ్వరరావు, బేసి కొర్లాం నీటి సంఘాల అధ్యక్షులు, రైతు సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

ఇచ్ఛాపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): మొక్కలను నాటడంతో పాటు వాటిని పెంచడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలని రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు డా.టి.మోహన్ వెంకటేష్, రామకోటి అన్నారు. ఆదివారం సురంగి రాజా మైదానం చుట్టూ వంద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొక్కల సంరక్షణ బాధ్యతలు స్వీకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఇంట్రాక్ట్ క్లబ్ సభ్యులు, రోటరీ సభ్యులు పి.దినోష్, ఎం.నవీన్, జోగారావు, దక్కత కృష్ణమూర్తి రెడ్డి, డి.కృష్ణమూర్తి, ప్రఫుల్‌కుమార్‌పండా, షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

లావేరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): లావేరు మండల సమస్య లను పరిష్కరించాలని టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ కోరారు. ఈ మేరకు ఆదివారం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. సమస్యలపై వినతిపత్రం అందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.


మంత్రి అచ్చెన్నాయుడును కలిసిన సురేష్

బీజేపీ జిల్లా కార్యవర్గం ప్రకటన

పాత శ్రీకాకుళం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ శ్రీకాకుళం జిల్లా కార్యవర్గాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు శిరిపురం తేజేశ్వరరావు నియమిస్తూ ఒక ప్రకటన విడుదలచేశారు. ప్రధాన కార్యదర్శులుగా చింతు పాపారావు, పెదడ సూరపునాయుడు, కార్యదర్శిగా వీకే ప్రసాద్, ఐటీ సెల్ కన్వీనర్‌గా రావాడ పురుషోత్తం, సోషల్ మీడియా కన్వీనర్‌గా బాడే తాతారావులను నియమించారు. అలాగే ఉపాధ్యక్షులుగా 8 మందిని నియమిస్తూ ఆ ప్రకటన విడుదల చేశారు.

ఎస్ఐగా గంగరాజు

గార, రూరల్ జూలై 20 (ఆంధ్రజ్యోతి): గార ఎస్ఐగా చోడిపిల్లి గంగరాజు ఆది వారం విధుల్లో చేరారు. ఈయన విజయనగరం జిల్లా ఎస్.కోట ఎస్ఐగా పనిచేశారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన జనార్దనరావు బదిలీ అయ్యారు.



చికిత్సపొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



పలాస, జూలై 20(ఆంధ్రజ్యోతి): పలాస ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతూ గుర్తుతెలియని వ్యక్తి(40) మృతి చెందినట్లు కాశీబుగ్గ ఎస్ఐ చంద్రరావు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. పలాస రైల్వేస్టేషన్ నుంచి రోడ్డుమార్గం మీదుగా వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి కుప్పకూలిపోయాడు. దీంతో స్థానికులు ఆయన్ను ఆసుపత్రిలో చేర్పించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. గుండెపోటు కారణంగా మృతి చెందిఉంటాడని అనుమానిస్తున్నారు. ఆయనకు చెందిన వివరాలు ఏవీ లభ్యం కాలేదు.ఈ మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హనుమంతునాయుడుపేటలో ఒకరి ఆత్మహత్య

సంతబొమ్మాళి,జూలై20(ఆంధ్రజ్యోతి):మండలంలోని హనుమంతునాయుడుపేటకు చెందిన సీరపు అప్పలస్వామి(40)గడ్డిమందు తాగి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నౌపడ ఏఎస్ఐ రమేష్‌దేవ్, స్థానికుల కథనం మేరకు.. గ్రామంలో అప్పలస్వామి వ్యవసాయపనులు చేస్తున్నాడు.కొద్దిరోజులుగా కుటుంబంలో చిన్నపాటి తగాదాలు జరుగుతుండడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూలేని సమయంలో గడ్డి మందు తాగాడు. అపస్మారక ఉన్న అప్పలస్వామి టెక్కలి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు తెలిపారు. అప్పలస్వామికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

రైలు నుంచి జారిపడి ఒకరికి గాయాలు

పలాస, జూలై 20(ఆంధ్రజ్యోతి): పలాస రైల్వేస్టేషన్ సమీపంలో జయరామచంద్రపురం వద్ద రైలు నుంచి జారిపడి బరంపురానికి చెందిన అలోక్ రంజన్ గాయపడ్డాడు. ట్రాక్ పక్కన అచేతనంగా పడి ఉండడంతో 108 సిబ్బందికి రైల్వేసిబ్బంది సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకొని అలోక్‌రంజన్‌ను పలాస ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఈమేరకు రైల్వే ఎస్ఐ షరీఫ్ కేసు నమోదుచేశారు.

ప్రేమించి మోసగించడంపై కేసు నమోదు

పోలాకి, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ఒకరు ప్రేమించి మోసగించడంపై పోలాకి పోలీసులు కేసు నమోదుచేశారు.గ్రామానికి చెందిన బాధితురాలి తల్లి తన కుమార్తెను అదే గ్రామానికి చెందిన లండ సూర్యనారాయణ కొద్దికాలంగా ప్రేమించి మోసగించడంతో పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఈమేరకు కేసు కేసు నమోదుచేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

కౌమారదశలో స్నేహంగా ఉండాలి: డీఈవో

నరసన్నపేట, జూలై20(ఆంధ్రజ్యోతి): కౌమారదశలో బాలలు ఒడిదుడుకులకు లోనవుతారని, ఈదశలో పిల్లలతో తల్లిదండ్రులు స్నేహంగా ఉండి వారి భావాలను తెలుసుకోవాలని డీఈవో తిరుమల చైతన్య కోరారు.ఆదివారం నరసన్నపేటలో విద్యార్థి భవన్ ఐఐటీ అకాడమీ ఆధ్వర్యంలో టీన్ పేరెంటింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌమారదశలో పిల్లలు ప్రవర్తనలో తల్లిదండ్రులు దృష్టిసారించాలని సూచించారు. ఒత్తిడికిలోను కాకుండా తగిన కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఆరంగి గోవిందబాబు, ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

వీఆర్వోల సంఘ జిల్లా అధ్యక్షుడిగా వేణుగోపాలరావు

నరసన్నపేట, జూలై 20(ఆంధ్రప్రదేశ్): వీఆర్వోల సంఘ జిల్లా అధ్యక్షులుగా ప్రగడ వేణుగోపాలరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెల్ల అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం టెక్కలిలో జరిగిన సంఘ ఎన్నికల్లో కార్యదర్శిగా శ్రావణ్, ట్రెజరర్‌గా కె.ప్రసాద్, ఉపాధ్యక్షులుగా పి.తిరుపతి, జాయింట్ సెక్రటరీలుగా కృష్ణంరాజు, ఇందిరాప్రియదర్శినలను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

గౌరవవేతనం రూ.20 వేలకు పెంచాలి

పాతపట్నం, జూలై20(ఆంధ్రజ్యోతి):మధ్యాహ్న భోజనవంట, శానిటేషన్ కార్మికులకు కనీస గౌరవ వేతనం రూ.20వేలకు పెంచాలని సీఐటీయూ జిల్లాఉపాధ్యక్షుడు కె.సూరయ్య కోరారు.ఆదివారం పాతపట్నంలో ఏపీ మధ్యాహ్నభోజనపథక కార్మికుల యూనియన్ పాతపట్నం మండలశాఖ సమావేశం నిర్వహించారు. సమవేశంలో టి.సీతమ్మ,పడాలకుమారి, బలగ జ్యోతిమ్మ, బొమ్మాళి రేవతి, సరస్వతి, గౌతమి పాల్గొన్నారు.

జనసేన నాయకుడికి షోకాజ్ నోటీసు

హిరమండలం, జూలై 20(ఆంధ్రజ్యోతి): జనసేన నాయకుడు మామిడి రామకృష్ణ ఏఎంసీ చైర్మన్ నియమితులుకాగా, దీనికి వ్యతిరేకిస్తూ ఆ పార్టీ నాయకుడు వంజరాపు సింహాచలం నిరసన తెలియజేయడంతో జిల్లా పార్టీ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. పార్టీ నియమావళిని ఉల్లంఘించడం,నాయకులను దూషించడం,ఇతర పార్టీ నాయకులతో కలిసి కోవర్టు రాజకీయాలు చేసిన విషయం పార్టీ దృష్టికి వచ్చిందని నోటీసులో పేర్కొన్నారు. ఈ విషయంపై సమాధానం చెప్పాలని, లేకపోతే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని తెలిపారు. కాగామొదటి నుంచి పార్టీ పటిష్టత కోసం కష్టపడి పనిచేసిన వారికి మాత్రమే పదవులు కట్టబెట్టాలని జనసేన నాయకులు వంజరాపు సింహాచలంతో పాటు మరి కొంతమంది హిరమండలంలో ఆదివారం నిరసన తెలిపారు.

●పాతపట్నం, జూలై 20(ఆంధ్రజ్యోతి):సేవలందించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకువస్తానని హిరమండలం ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన మామిడి రామకృష్ణ తెలిపారు. ఆదివారం పాతపట్నంలో జనసేన నాయకులుసమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఏఎంసీచైర్మన్‌గా రామకృష్ణకు నియమించడంపై ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

బాలలకు బాసటగా నిలిచిన దాతలు

● కోటబొమ్మాళిలోని కేజీబీవీలో ప్రవేశం కల్పించిన సిబ్బంది



దేవాదిలో మోహిని,యోగిత బంధువులకు నగదుఅందజేస్తున్న దాతలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నరసన్నపేట, జూలై20(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవాదికిచెందిన బండిమోహిని, యోగితలకు దాతలు బాసటగా నిలుస్తున్నారు. ఈనెల 15న రోడ్డు ప్రమాదంలో తండ్రి బండికృష్ణ మృతిచెందాడు. ఏడాది కిందట తల్లి అనారోగ్యంతో మృతిచెందడంతో ఆ బాలలు తల్లిదండ్రులు లేక ఒంటరివారయ్యారు. ఈనేపథ్యంలో పిల్లలు తల్లిదండ్రులు కోల్పోయిన సంఘటనపై పాపం చిన్నారులు శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ఈనెల 16న కథనం ప్రచురితమయ్యింది. ఈ కథనానికి స్పందించిన కొందరు దాతలు బాలలను ఆదుకునేందుకు ముందుకువస్తున్నారు. మాకివలస ఉన్నత పాఠశాలలో చదివే ఆ ఇద్దరు బాలలకు ఇటీవల కోటబొమ్మాళి కేజీబీవీలో చదివేందుకు అక్కడి సిబ్బంది ముందుకువచ్చి అవకాశం కల్పించారు. అలాగే ఆదివారం కంబకాయికి చెందిన జి.కృష్ణారావు, అనురాధ, సి.వెంకటరమణ, దేశవానిపేటకు చెందిన బొంగు సునీతలు, కన్నెవలసకు చెందిన పి.యశ్వంత్‌లు దాతల నుంచి సేకరించిన రూ. 25,500లు మోహిని, యోగిత అమ్మమ్మ, తాతయ్యలు ధర్మాన సాయిమ్మ, నీలంలకు అందజేశారు. వారి ఉన్నత చదువులు కోసం నగదును వినియోగించాలని దాతలు సూచించారు.

కాలువలు లైనింగ్ లేక.. గుర్రపు డెక్క తొలగించక



జగన్నాథపురం వద్ద కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క

● 300 ఎకరాలకు నీరందని దుస్థితి
● ఇదీ కృష్ణసాగరం ఆయకట్టులో అన్నదాతల పరిస్థితి

మెళియాపుట్టి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగన్నాథపురం,గోపినాథపురంలోగల 300ఎకరాలకు కృష్ణసాగరం నుంచి నీరందకపోవడంతో అన్నదాతలు ఆందోళనచెందుతన్నారు. ఒడిశాలోని మహేంద్రతనయ కొండలనుంచి వచ్చేనీరు ఈసాగరంలోకి చేరుతుంది. అయితే ఏళ్ల తరబడి కాలువల లైనింగ్ లేకపోవడంతోపాటు సాగరంలో గుర్రపు డెక్క తొలగించకపోవడంతో సాగరంలోకి నీరు పూర్తిస్థాయిలో చేరడం లేదు.కొండల నుంచి నీరువచ్చే నాలుగుకిలోమీటర్ల పొడవునా కాలువలు అధ్వానంగా మారాయి. దీంతో ఖరీఫ్‌లో సైతం ఆయకట్టుకు నీరందడం లేదని రైతులు వాపోతున్నారు. కొద్దేళ్లుగా కృష్ణసాగరానికి కనీస మరమ్మతులు లేకపోవడం, పూడిక పేరుకుపోవడంతో నీటినిల్వ సామర్థ్యం తగ్గడం వల్ల ఖరీఫ్‌లో సైతం ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందడం లేదని రైతులు వాపోతున్నారు. కనీసం ఉపాధిహామీ పథకం నిధులతోనైనా కాలువల్లో గుర్రపు డెక్క, పూడిక తొలగించాలని అధికారులను కోరినా చర్యలు తీసుకోవడంలేదని జగన్నాథపురం గ్రామానికి చెందిన వట్టికుళ్ల చక్రవర్తి తదితరులు తెలిపారు. ఇప్పటికైనా కాలువలు పూడిక తొలగించి కృష్ణసాగరం ఆయకట్టుకు నీరందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

● జిల్లావ్యాప్తంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాలు

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని టీడీపీ నాయకులు తెలిపారు. ఆదివారం జిల్లాలోని పలుచోట్ల తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేసి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

●సోంపేట రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): విక్రంపురంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ గ్రామస్థుల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మద్దు కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి మద్దిల నాగేశ్వరరావు, చంద్రమోహన్, చిత్రాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

●పలాస రూరల్, జూలై20(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వంతోనే పల్లెలు అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. మండలంలోని గరుడఖండి పంచాయతీలో సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో ఏపీడీటీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ నాయకులు పి.విఠల్‌రావు, టీడీపీ మండలాధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణకుమార్, సంతోష్‌నాయుడు, బి.కృష్ణంరాజు, మౌళి, బి.ప్రసాద్,రామారావు పాల్గొన్నారు.

●పలాస,జూలై20(ఆంధ్రజ్యోతి):పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలోని 25,26, 27వార్డుల్లో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, కృష్ణారావు, పట్ట మల్లేసు పాల్గొన్నారు.

●ఆమదాలవలస, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తోటాడ పంచాయతీ మహాసాహెబ్‌పేటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్ర మం నిర్వహించారు.కార్యక్రమంలో ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూనరవికుమార్,టీడీపీ మం డలాధ్యక్షుడు నూకరాజు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు సుజాత, తమ్మినేని నాని, సనపల ఢిల్లీశ్వరరావు, హనుమంతు బాలకృష్ణ, తాండ్ర హరి, నాగళ్ల మురళీధర్‌యాదవ్ పాల్గొన్నారు.

●గార/గారరూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతానని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. కొర్ని,కొర్లాం, కొమరవానిపేటల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్నారు.

● జలుమూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కరవంజలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు జుత్తు అప్పలనాయుడు పాల్గొన్నారు. అలాగే రామయ్యవలసలో టీడీపీ నాయకులు కొర్ను సూరన్నాయుడు ఆధ్వర్యంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు.

●జలుమూరు, (సారవకోట), జూలై 20 (ఆంధ్రజ్యోతి):సారవకోట మండలంలోని కోదడ్డపనస, వడ్డినవలస, బుడితి, కుమ్మరిగుంటల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, నాయకులు బలగ భాస్కర్, ఇప్పిలి అశోక్‌కుమార్, బోర ధర్మారావు పాల్గొన్నారు.

●పోలాకి, జూలై 20(ఆంధ్రజ్యోతి):మండలంలోని అంపలాం, పల్లిపేట, మెట్టపేట, చితమానిపేట, రాజారాంపురంల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త బగ్గుఅర్చన, ఎంవీ నాయుడు, మైలపల్లి త్రినాథరావు, తార రామకృష్ణ పాల్గొన్నారు.



సోంపేట రూరల్: విక్రంపురంలో మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్



గార/గార రూరల్: కొర్లాంలో కరపత్రం అందజేసి పథకాలను వివరిస్తున్న శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



ఆమదాలవలస: మహాసాహెబ్‌పేటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్



పలాస రూరల్: గరుడఖండిలో సుపరిపాలన-తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గౌతు శిరీష

హెచ్ఆర్ఏ తీసుకొని.. రాకపోకలు సాగించి

● కొరవడుతున్న సమయపాలన
● ఇదీ టెక్కలి డివిజన్‌లో ఉద్యోగుల పరిస్థితి

టెక్కలి, జూలై 20(ఆంధ్రజ్యోతి):టెక్కలి డివిజన్‌లోని పలువురు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు స్థానికంగా ఉండకుండా సుదూర ప్రాంతాల నుంచి ప్రభుత్వ పనిదినాల్లో రాకపోకలుచేస్తున్నారు. కొందరు ఇక్కడే హెచ్ఆర్ తీసుకొని ఇతర ప్రాంతాల నుంచి వస్తున్నారు. నాలుగుచక్రాల వాహనానికి అనుమతి ఉండడంతో చాలామంది డివిజన్, మండలస్థాయి అధికారులు వాటినే వినియోగిస్తున్నారు. పలుశాఖల అధికారులు రాకపోకల వల్ల సమయపాలన కొరవడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్నిశాఖల అధికారులైతే ఏకంగా రైళ్ల, బస్సుల్లో కూడా రాకపోకలు సాగిస్తున్నారు. పిల్లల చదువులు, వైద్య, వసతిసౌకర్యాలు జిల్లాకేంద్రంలో ఉన్నట్లు ఇక్కడలేకపోవడంతో నివాసం ఉండేందుకు అధికారులు ఇష్టపడడంలేదు. ఇందులో కొందరు ఉద్యోగులు ఎఫ్ఏసీ అని సాకు చూపుతూ రాకపోకలు సాగిస్తున్నారు.పలువురు డివిజన్, మండలస్థాయి అధికారులు తిరుగుతున్న కార్లకు సంబంధించి జీపీఎస్ పరిశీలిస్తే ఎక్కడి నుంచి రాకపోకలు సాగిస్తున్నారో తెలుస్తుందని స్థానికులు చెబుతున్నారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గంలో పదుల సంఖ్యలో అధికారులు రాకపోకలు సాగించడంపై విమర్శలొస్తున్నాయి. ప్రధానంగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇక్కడి అధికారులు స్థానిక ఉండకపోవడంతోపాటు సమయపాలన పాటించడంలేదని ఆరోపణలు వినిస్తున్నాయి. ఇంకొందరు ఉద్యోగులు గ్రామీణ ప్రాంతాల్లో పర్యవేక్షణ పేరుచెప్పి రాకపోకలు సాగిస్తున్నారు.

ఇదీ పరిస్థితి

టెక్కలిలో వ్యవసాయశాఖ ఏడీ, పీడబ్ల్యూడీ డీఈఈ, గనులశాఖ సర్వేయర్, పశువైద్యాధికారి, సబ్‌రిజిస్ట్రార్, ఆర్టీసీ డిపో మేనేజర్, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ, ఉద్యానవనశాఖ ఏడీ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ, ఉపవిద్యాశాఖాధికారి, తహసీల్దార్, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిల్లా కేంద్రాసుపత్రి సూపరింటెండెంట్, హౌసింగ్ డీఈఈ, ఎంపీడీవో శ్రీకాకుళం నుంచి టెక్కలి రాకపోకలు సాగిస్తున్నారు.సహాయ వెనుకబడిన తరగతుల అధికారి, పీఏసీఎస్ సీఈవో, డీఎల్‌డీవో, ఎండోమెంట్ ఈవో, డివిజనల్ పంచాయతీఅధికారి వేర్వేరు ప్రాంతాలనుంచి రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఆర్‌అండ్‌శాఖలో పదుల సంఖ్యలో ఉద్యోగులు విశాఖ నుంచి ప్రతిరోజూ రైలులో రాకపోకలు కొనసాగించడం విశేషం.

లక్షా 15 వేల పింఛన్ల మంజూరు

● వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

టెక్కలి, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లక్షా15వేల మంది వితంతు పింఛన్లు ఈనెలలో మంజూరు చేయనున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతెలిపారు.ఐదువేల కోట్లతో అన్నదాత సుఖీభవ, మూడువేల కోట్లతో మహిళలకు ఉచిత బస్సుసౌకర్యం కల్పిస్తామని చెప్పారు.ఆదివారం టెక్కలి పంచాయతీలోని అంజనాపురంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ముందుఇచ్చిన హామీమేరకు నిరుద్యోగభృతి, ఆటోడ్రైవర్లకు ఆర్థికసాయం వంటివి కూడా ప్రాధాన్యతాక్రమంలో అందజేస్తామన్నారు. అంజనాపురంలో రూ.కోటి 95లక్షల ఉపాధి నిధులతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అంజనాపురం సమీపంలో గల లేఅవుట్‌ను రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఒక లబ్ధిదారునికి మూడుసెంట్లు స్థలం చొప్పున్న అర్హులైన వారిని గుర్తించి ఇళ్ల పట్టాలు పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి సూచించారు. తాను ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తుంటే ఓట్లు మాత్రం ఇతరులకు వేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు బురదరోడ్లపై నడిచి ముందుకుసాగారు. కార్యక్రమంలో పినకానఅజయ్‌కుమార్, ఎల్ఎల్‌నాయుడు, హనుమంతు రామకృష్ణ, లవకుమార్, కామేసు, సుందరమ్మ, ఆనంద్, రాము, షణ్ముఖరావు, దల్లి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి దివ్యాంగుడికి ఉపకరణాలు

జిల్లాలో అర్హులైన దివ్యాంగులకు రూ.3కోట్ల50లక్షలతో పలురకాల ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్లు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఆదివారం టెక్కలి మండలపరిషత్ కార్యాలయంలో డివిజన్‌కు సంబంధించి రూ.73లక్షలతో 352మంది దివ్యాంగులకు బ్యాటరీ ఆపరేటర్ మోటరైజ్డ్ ట్రైసైకిల్, హియరింగ్ కిట్స్, ట్రైసైకిళ్లు, స్టిక్స్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగులు పేరుతో కొందరు తప్పుడు సర్టిఫికెట్లు తెచ్చి పింఛన్లు పొందుతున్నారని, క్షేత్రస్థాయిలో దర్యాప్తు నిర్వహించి వాటిని తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో సీఈవో శ్రీధర్‌రాజా, ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, బోయిన గోవిందరాజులు, ఎల్ఎల్‌నాయుడు, పినకాన అజయ్‌కుమార్, హనుమంతు రామకృష్ణ, లవకుమార్, కామేసు, దమయంతి, గండి సూర్యనారాయణరెడ్డి, దోని బుజ్జి, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.



దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

బాధితులను ఆర్థికంగా ఆదుకుంటాం: ఎంజీఆర్



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఎల్.ఎన్.పేట/పాతపట్నం,జూలై 20(ఆంధ్రజ్యోతి):బాధితులను ఆర్థికంగా ఆదుకుంటామని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న బాధితులకు సహకరిస్తామని చెప్పారు.ఎల్.ఎన్.పేట మండలంలోని యంబరాం గ్రామానికి చెందిన వెలమల తేజ మణికంఠ కడుపునకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు.వైద్యంచేయించుకొనేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఎమ్మెల్యే గోవిందరావు దృష్టికి స్థానికులుతీసుకువచ్చారు.దీంతో సీఎంఆర్‌ఎఫ్ ఫండ్ నుంచి రూ.91,204 చెక్కును పాతపట్నంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం అందజేశారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుల ఎన్నిక ఏకగ్రీవం

కాశీబుగ్గ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జంటపట్టణాల్లో ఆదివారం లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుల ఎన్నికల ఎకగ్రీవంగా జరిగింది.ది ఇంటర్ నేషనల్ అసోసియేషన్ ఆఫ్ లయన్స్‌క్లబ్ పలాస పరిధిలో నాలుగు క్లబ్‌లు కొనసాగుతున్నాయి.లయన్స్‌క్లబ్ క్యాషూలాండ్ ప్రెసిడెంట్‌గా అట్టాడ మాధవరావు,లయన్స్ క్లబ్‌పలాస కాశీబుగ్గప్రెసిడెంట్‌గా మధుసూదనరావు,లయన్స్‌క్లబ్ పాలబుగ్గ ప్రెసిడెంట్‌గా తరుణ్‌కుమార్, లయన్స్‌క్లబ్ వనితా విభాగం ప్రెసిడెంట్‌గా స్వేతాకుమారిని ఎన్నుకున్నారు. వీరితోపాటు నాలుగు క్లబ్‌ల సెక్రటరీలు, కోశాధికారులను కూడా ఎన్నుకున్నారు.వీరికిజిల్లా చైర్‌పర్సన్ వీఎంరావు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో విశాఖక్లబ్ నుంచి డీఎస్ఎస్వీ వర్మ, సుబ్బరాజు, శ్రీనివాస్‌రావు, కృష్ణమోహన్,మల్లా జయశ్రీ పాల్గొన్నారు.

తిలారు అండర్ పాసేజీలో వర్షం నీరు చేరికతో అవస్థలు

జలుమూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) తిలారు రైల్వేగేటు వద్ద నిర్మించిన అండర్ పాసేజ్‌లో వర్షం నీరు చేరడంతో వాహన చోదకులు అవస్థలుపడుతున్నారు. తిలారు రైల్వేగేటు వద్ద వంతెన పనులు పూర్తవడంతో నరసన్నపేట, సారవకోట వెళ్లాల్సిన వాహనాలు డైరక్టుగా వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. ఇక్కడి రైల్వేస్టేషన్‌కు చిన్నదూగాం, యాళ్లపేట, గ్రామాల ప్రయాణికులు అండర్ పాసేజ్ గుండా రాకపోకలు సాగించాల్సి వస్తోంది

పోలీసులు వాహనాల తనిఖీ

టెక్కలి, జూలై 20(ఆంధ్రజ్యోతి): జగతి మెట్ట సమీపంలో పోలీసులు ఆదివారం వాహనాలు తనిఖీచేసి డ్రెంక్ అండ్‌డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహించారు. తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలుసుకున్న వాహన చోదకులు మరో మార్గంలో గమ్యస్థానాకుల చేరుకున్నారు.

నిలకడలేని జీడి ధర

(ఐదో పేజీ తరువాయి)

సర్వత్రా వ్యక్తమవుతోంది. గత వైసీపీ ప్రభుత్వం జీడికి గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్పి రైతులను మోసం చేసింది. బస్తాకు రూ.వెయ్యి అదనంగా చెల్లిస్తామని చెప్పింది.కానీ, ఒక్క రైతుకూ అందినపాపాన పోలేదు. ముఖ్యంగా ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలు పెరుగుతుండడంతో జీడి సాగు రైతులకు భారంగా మారింది. అప్పులు చేసి అధిక పెట్టుబడి పెట్టి పంట సాగు చేస్తున్నా గిట్టుబాటు ధరలు లేక నష్టపోతున్నారు. మరో పక్క దళారీ వ్యవస్థతో రైతులు మోసపోతున్నారు. గతంలో వ్యాపారులే నేరుగా రైతుల నుంచి జీడిపిక్కలను కొనుగోలు చేసేవారు. నచ్చిన ధరకు రైతులు పంటను విక్రయించేవారు. ప్రస్తుతం దళారులేగ్రామాలకు వచ్చి పిక్కలనుకొనుగోలు చేస్తున్నారు. రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని వ్యాపారులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ధరలు పెరగకుండా దళారులే అడ్డుకుంటున్నారనే రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వాలు స్పందించి మిగిలిన పంటల వలే జీడిపంటకు గిట్టుబాటు కల్పించి, ధరల స్థిరీకరణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. దళారీ వ్యవస్థను నియంత్రించాలని విన్నవిస్తున్నారు.

అధికారులు దృష్టి సారించాలి

జీడిపిక్కల ధరలు స్థిరీకరణ జరిగితేనే రైతులకు మేలు జరుగుతుంది. ధరల హెచ్చుతగ్గులతో రైతులు నష్టపోతున్నారు. పంటను ఎప్పుడు అమ్ముకోవాలో తెలియక అయోమయం చెందుతున్నారు. గిట్టుబాటు ధరపె దృష్టిని కేంద్రీకరించాలి.

- కోనేరు కామేశ్వరరావు, బైపల్లి

దళారులతో మోసపోతున్నాం

జీడిపిక్కలను ఒకప్పుడు వ్యాపారులు నేరుగా రైతుల నుంచి కోనుగోలు చేసేవారు. ప్రస్తుతం దళారులే గ్రామాలకు వచ్చి పిక్కలను కొనుగోలు చేస్తున్నారు. వారే ధరలను నిర్ణయిస్తున్నారు.ధరలు పెరగకుండా చేసి రైతులను మోసం చేస్తున్నారు.

- జోగి తిరుపతిరావు, రైతు, గుణుపల్లి

పేరుకే పెద్దాసుపత్రి

(ఐదో పేజీ తరువాయి)

కూడా ఎలక్ట్రీషియన్లదే. కానీ ఉన్నదేమో కేవలం ముగ్గురే. రోజుకు మూడు షిప్టుల్లో పనిచేయాల్సి ఉంటుంది. మరి ముగ్గురితో మొత్తం నిర్వహణ ఎలా సాధ్యపడుతుందో ఆ అధికారులకే ఎరుక. దీనికి సంబంధించి ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీరింగ్ విభాగం మెయింటెనెన్స్ సిబ్బందిని సుమారు పదిమంది క్వాలిఫైడ్ ఎలక్ట్రీషియన్లు, అలాగే ఆసుపత్రికి సంబంధించి మరో పదిమంది ఎలక్ట్రీషియన్ల అవసరం ఉంది. కానీ అధికారులు చర్యలు తీసుకుంటున్నామని చెబుతూనే ఉన్నా, ఆచరణకు నోచుకోవడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో ముగ్గురిలో ఎవరైనా ఎలక్ట్రీషియన్ సెలవు పెడితే పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. అలాగే ఆసుపత్రిలో ఐదు లిఫ్టులు ఉండగా.. కేవలం ఒక్కరే ఆపరేటర్ ఉన్నాడు. లిఫ్టులు కూడా తరచూ మొరాయిస్తూనే ఉన్నాయి. గైనిక్ వార్డులోని లిఫ్ట్ సంవత్సరంపొడవునాపాడవుతూనే ఉంటోంది. అధికారులు వస్తున్నారు. వెళ్తున్నారు. నాయకులు తరచు పరిశీలించడం, హామీలు ఇవ్వడం తప్ప సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు,పాలకులు స్పందించి జీజీహెచ్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రైతులకు ఎరువుల పంపిణీ

ఎల్.ఎన్.పేట, జూలై 20(ఆంధ్రజ్యోతి):మండలంలోని పెద్దకొల్లివలస గ్రామసచివాలయంలో ఆదివారం రైతులకు ఎరువులను పంపిణీచేశారు. కార్యక్రమంలో ఏవో కె.సింహాచలం, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఆర్.మన్మథరావు, బాలు, రాము,గణేశ్‌కుమార్, జోగారావు, ఆర్.రామారావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళిలో వైద్యశిబిరం

కోటబొమ్మాళి, జూలై 20 (ఆంధ్రజ్యోతి):కోటబొమ్మాళిలో శ్రీకృష్ణాపురానికి చెందిన జైశ్రీరామ్ సిద్ధ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు జగదీశ్వరరావు, శ్రీనివాస్, దయామని పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

నరసన్నపేట, జూలై 20(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలోని వీరన్నాయుడు కాలనీలో 15వ ఆర్థిక సంఘ నిధులతో చేపట్టే సీసీ రోడ్డు పనులు ఈవో ద్రాక్షాయిణి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.కోటి తో సీసీ రోడ్లు, డ్రైనేజీపనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకరరావు, సాసుపల్లి కృష్ణబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

మెళియాపుట్టి, జూలై 20(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వానికి గిరిజనులు రుణపడి ఉంటామని పాతపట్నం మార్కెట్ కమిటీ చెర్మన్‌గా నియమితులైన చిన్నింటి గౌరమ్మ తెలిపారు.ఈ పదవి గిరిజనులకు కేటాయించడంతో ఆదివారం వెంకటాపురంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్, ఎమ్మెల్యే ఎంజీఆర్ పటాలకు పాలాభిషేకం నిర్వహించారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ గూడ కాంతమ్మ, విద్యాకమిటీ చెర్మన్ చిన్నంటి పార్వతి పాల్గొన్నారు.